ఓటరు తుది జాబితా ప్రదర్శన

సారంగాపూర్, ఫిబ్రవరి 15: ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్లు, ఓటరు తుది జాబితా వివరాలను మండలపరిషత్ కార్యాలయం నోటీస్ బోర్డుపై ఎంపీడీవో గంగాధర్ శనివారం ప్రదర్శించారు. మండలంలోని 18 గ్రామాల్లో ఏడు ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 37 పోలింగ్ స్టేషన్లు, 20,463 మంది ఓటర్ల వివరాల జాబితాను నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. అలాగే బీర్‌పూర్ మండలంలో ఆరు ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి 34 పోలింగ్ స్టేషన్లు, 17,700మంది ఓటర్ల వివరాలను ఎంపీడీవో లచ్చాలు నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. ఇక్కడ సూపరింటెండెంట్ మధులత, సిబ్బంది ఉన్నారు.

రాయికల్, ఫిబ్రవరి 15: మండల పరిషత్ రెండో సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల తుదిజాబితాను ఎంపీడీవో చిరంజీవి నోటీస్ బోర్డుపై ప్రచురించారు. మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలు, 77 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మండలంలో 39,464 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 18,579 మంది, స్త్రీలు 20,882 మంది, ఇతరులు ఒకరు ఉన్నారన్నారు.

మొక్క నాటుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు

తండాలను జీపీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

సారంగాపూర్, ఫిబ్రవరి 15: గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌దేనని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. శనివారం ధర్మనాయక్‌తండా గ్రామంలో సంతుసేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కేసీఆర్ ముందస్తు జన్మదిన వేడుకల్లో భాగంగా ఆలయ సమీపంలో మొక్కలు నాటారు. ఇక్కడ మాజీ సర్పంచ్ భుక్యా సంతోష్ కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు తేలు రాజు, ప్రధాన కార్యదర్శి అనంతుల గంగారెడ్డి, యూత్ అధ్యక్షుడు మదన్, నాయకులు ఎండబెట్ల ప్రసాద్, గంగాధర్, గంగారెడ్డి, వెంకటేష్, తిరుపతి పాల్గొన్నారు.

సమాజ సేవ చేసేందుకు వస్తున్నా..

మాట్లాడుతున్న స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి డా ప్రసన్న హరికృష్ణ

ధర్మపురి, ఫిబ్రవరి 15: సమాజ సేవ చేయాలనే తపనతో ముందుకు వస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటేసి ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి డా ప్రసన్నహరికృష్ణ కోరారు. శనివారం ధర్మపురి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పట్టభద్రులకు ఒక భరోసాను కల్పించడానికి ప్రొఫెసర్‌గా 19సంవత్సరాల ఉద్యోగ జీవితాన్ని తృణప్రాయంగా పక్కనబెట్టి.. రాజకీయాల్లోకి వస్తున్నానని, పట్టభద్రులు, నిరుద్యోగులు, ఓటర్లు ఆలోచించి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో పట్టభద్రులు, నిరుద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ విధులపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ బీ సత్యప్రసాద్
- ఎమ్మెల్సీ ఎన్నికల విధులపై పీవోలు, ఏపీవోలకు శిక్షణ తరగతులు

మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

సమావేశంలో పాల్గొన్న అధికారులు

జగిత్యాల, ఫిబ్రవరి 15: నిజామాబాద్-కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలతో కూడిన ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియపై సంపూర్ణ అవగాహన కలిగిఉండాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ నోడల్ అధికారులకు సూచించారు. జిల్లాలోని ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలకు సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో శనివారం మొదటి విడుత శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాలెట్ పద్ధతిన జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు కొంత ఎక్కువ వ్యవధి పట్టే అవకాశం ఉన్నందున సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని హితవుపలికారు. జిల్లాలో 51 పట్టభద్రుల పోలింగ్ స్టేషన్లు, 20 ఉపాధ్యాయ పోలింగ్‌స్టేషన్లు, ఏర్పాటు చేశామని, వీటిలో 18 కామన్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ఈ నెల 27న ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ఉంటుందని, గడువులోగా పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూలో ఉన్న వారికి టోకెన్ నంబర్లు అందించి ఓటింగ్ చేయించాలని ఆదేశించారు. ఈ నెల 26న ఉదయం 8గంటలకు ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ జరిగేలా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత కరీంనగర్‌లోని రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టంచేశారు. పీవోలు, ఏపీవోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతలపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ బీఎస్ లత, సిబ్బంది ఉన్నారు.

ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించాలన్నదే లక్ష్యం

జిల్లాలో అర్హత ఉన్న నిరుపేదలకు ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ బీ సత్యప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీవో, ఎంపీవో, ఏఈ, డీఈ పంచాయతీ సెక్రటరీలతో సమావేశమై, మాట్లాడారు. జిల్లాలోని నిరుపేదలకు ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలన్నారు. ఇందిరమ్మ యాప్ ద్వారా దరఖాస్తుదారుని స్థితిగతులను తెలుసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 26వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టనన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీ గౌతమ్‌రెడ్డి, డీఆర్డీవో రఘువరుణ్, ఆయాశాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్రిటెక్ మార్కెట్ ఆక్సెస్‌పై అవగాహన

మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ భారతి నారాయణ భట్

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 15: పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, గ్రామీణ ఆవిష్కరణ స్పోక్స్, అగ్రి ఇన్నోవేషన్ హబ్ ఆధ్వర్యంలో ఆగ్‌మాప్ అగ్రిటెక్ మార్కెట్ ఆక్సెస్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతీ నారాయణ భట్ మాట్లాడుతూ, రైతులు వివిధ కంపెనీల ఉత్పత్తులు, సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరిశోధనా స్థానం సహ సంచాలకుడు డాక్టర్ బీ శ్రీనివాస్ మాట్లాడుతూ, రూరల్ ఇన్నోవేషన్ స్పోక్స్ సేవలు, కార్యక్రమాలను అందిపుచ్చుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలన్నారు. అధునాతన పనిముట్లను వాడడంతో ఖర్చు తగ్గి దిగుబడులు పెరుగుతాయన్నారు. ఆగ్ హబ్ సీఈవో విజయ్ మాట్లాడుతూ, వివిధ కంపనీల ఉత్పత్తులను రైతులు సద్వినియోగం చేసుకుంటే లాభాలు పొందవచ్చన్నారు. కరీంనగర్ నాబార్డ్ ఏజీఎం హెచ్ జయప్రకాశ్ మాట్లాడుతూ, రైతులు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. రూరల్ ఇన్నోవేషన్ స్పోక్, శాస్త్రవేత్త డాక్టర్ డీఏ రజినీదేవి రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు స్టార్టప్ కంపెనీల సేవలను ఉపయోగించుకొనేందుకు స్పోక్స్ అందించే సహాయాన్ని వివరించారు. అనంతరం రైతుల సందేహాలను శాస్త్రవేత్తలు, కంపెనీల ప్రతినిధులు నివృత్తి చేశారు. ఇక్కడ రైతు ఉత్పత్తిదారుల సంఘాల సీఈవోలు, బీఓడీఎస్ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, శాస్త్రవేత్తలు, రూరల్ కో ఆర్డినేటర్ రంజిత్‌కుమార్, అగ్రి హబ్, ప్రా జెక్ట్ మేనేజర్ ముఖేశ్, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల, ఫిబ్రవరి 15: జిల్లా కేంద్రంలో ఆదివారం ఉదయం 10నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ గోపికృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగిత్యాల 11కేవీ టౌన్ ఫీడర్ మెయింటనెన్స్ దృష్ట్యా జగిత్యాల టౌన్-1 సెక్షన్ పరిధిలో అంగడిబజార్, యాపర్ రోడ్డు, మార్కెట్ బ్యాక్ సైడ్ ఏరియా, కృష్ణానగర్, అరవిందనగర్, మార్కండేయ టెంపుల్ ఏరియా, టాక సంధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి సన్మానం

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు

కొడిమ్యాల, ఫిబ్రవరి 15: కొడిమ్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పాలకవర్గ సభ్యులు శనివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను శాలువాతో సత్కరించి సన్మానించారు. పాలకవర్గాల గడువును ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగించిన వారు సంతోషం వ్యక్తం చేశారు. ఇక్కడ సింగిల్ విండో చైర్మన్ మేన్నేని రాజనర్సింగరావు, సీఈవో గంగాధర్, డైరెక్టర్లు ఉన్నారు.

సత్తమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్యాల (కొడిమ్యాల), ఫిబ్రవరి 15: మల్యాల మండలంలోని రాజారాం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఎడిపెల్లి అశోక్ తల్లి సత్తమ్మ మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శనివారం పరామర్శించారు. సత్తమ్మ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానూభూతి తెలిపారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ కొండపల్కుల రామ్మోహన్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ అయిల్నేని సాగర్‌రావు, మాజీ సర్పంచులు బద్ధం తిరుపతిరెడ్డి, బద్ధం తిరుపతిరెడ్డి, రవివర్మ, మల్లారెడ్డి, కో ఆప్షన్ మాజీ సభ్యులు అజారుద్దీన్, కోటేశ్వరరావు, దేవరాజం, జున్ను సురేశ్, మిలుకూరి మల్లారెడ్డి, జనగాం శేఖర్, ప్రవీణ్ ఉన్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఆర్జేడీ

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

కథలాపూర్, ఫిబ్రవరి 15: మండల కేంద్రంతోపాటు సిరికొండలోని జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఎంఈవో కార్యాలయాన్ని వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలకు ప్రభుత్వం అందించిన ఐఎఫ్‌బీ బోర్డులను బోధనకు వినియోగిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. తర్వాత మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంఈవో శ్రీనివాస్, ఇన్‌చార్జి హెచ్ఎంలు రవికుమార్, వెంకటేశం, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇంగ్లిష్ భాష దినోత్సవం

కథలాపూర్, ఫిబ్రవరి 15: గంభీర్‌పూర్ జడ్పీ హైస్కూల్‌లో శనివారం ఇంగ్లిష్ భాష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు ఇంగ్లిష్ రచయితల ఫొటోలతో ప్రదర్శన ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు ఇంగ్లిష్ సబ్జెక్టుపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభచూపిన వారికి బహుమతులు అందించారు. ఇక్కడ హెచ్ఎం సుధాకర్‌రెడ్డి, ఇంగ్లిష్ టీచర్ సంజీవ్‌రెడ్డి ఉన్నారు.

మందకృష్ణ మాదిగను కలిసిన మాజీ ఎంపీపీ

మందకృష్ణ మాదిగకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎంపీపీ

మేడిపల్లి, ఫిబ్రవరి 15: హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగను శనివారం మాజీ ఎంపీపీ మకిలి ఇజ్రాయిల్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. మందకృష్ణ మాదిగకు ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు బంగారు దీపక్, ఎమ్మార్పీఎస్ మండల గౌరవాధ్యక్షుడు శంకర్ ఉన్నారు.

బీఎంఎస్ జిల్లా కమిటీ నియామకం

జగిత్యాల, ఫిబ్రవరి 15: జిల్లా కేంద్రంలోని స్థానిక మేరు భవనంలో బీఎంఎస్ కమిటీ జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మల్లేశం, జిల్లా కార్యదర్శిగా నక్క అశోక్, ఉపాధ్యక్షులుగా కొండవత్తిని గంగాధర్, జగన్, పడకంటి శారద, సహాయ కార్యదర్శులుగా మేకల యాదగిరి, నల్లూరి రమేశ్, ధరూర్ అరుణ్, వేణు, కోశాధికారిగా విజయేందర్‌రెడ్డిని నియమించారు. ఇక్కడ భారతీయ మజ్దూర్ సంఘ రాష్ట్ర సంఘటన కార్యదర్శి జే రామ్మోహన్, కార్యవర్గ సభ్యులు సుధీర్‌కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎద్దులాపురం సత్యనారాయణ, బీడీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 15: జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డీఈవో కే రాముకు టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు తిరుకోవెల శ్యామ్‌సుందర్, డాక్టర్ టీ శ్రీనివాస్ శనివారం వినతిపత్రం అందించారు. అదేవిధంగా కులగణన సర్వే, గత వేసవిలో ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల విధులు సీనియారిటీ ఆధారంగా కేటాయించాలన్నారు. ఆరు నెలలలోపు రిటైర్డ్‌మెంట్ అయ్యేవారికి, గర్భిణులు, దీర్ఘకాలిక రోగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు.

ఉగాది పురస్కారాలకు ఆహ్వానం

జగిత్యాల టవర్ సర్కిల్, ఫిబ్రవరి 15: శ్రీ విశ్వవసునామ సంవత్సరం ఉగాది శుభ సందర్భాన్ని పురస్కరించుకొని వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి ఉగాది పూర్ణకుంభ పురస్కారం, మహానంది పురస్కారం, బుద్ధ పూర్ణిమ పురస్కారం, నాట్య మయూరి పురస్కారం, నటరాజన పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలుగు, వెలుగు సాహితీ వేదిక సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు మార్చి 20లోగా దరఖాస్తు చేసుకోవాలని సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, జాతీ య అధ్యక్షుడు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, తెలంగాణ కార్యనిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ వలబోజు మోహన్‌రావు, కన్వీనర్ తుమ్మనపల్లి పూర్ణచంద్రాచార్యులు తెలిపారు. పూర్తి వివరాల కోసం ఈ నంబర్లలో (94944 00158, 9100 174351) సంప్రదించాలని సూచించారు.

పసుపు ధర @ ₹10,811

మెట్‌పల్లి, ఫిబ్రవరి 15: మెట్‌పలి వ్యవసాయ మార్కెట్‌లో శనివారం పసుపు ధరలు ఇలా ఉన్నాయి. పసుపు కాడి(కొమ్ము) క్వింటాల్‌కు గరిష్ట ధర ₹10,811, కనిష్ట ధర ₹5,611, పసుపు గోళ(మండ)కు గరిష్ట ధర ₹9,511, కనిష్ట ధర ₹5,556, పసుపు చూరకు క్వింటాల్‌కు గరిష్ట ధర ₹8,866 కనిష్ట ధర ₹4,001 పలికినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు మార్కెట్‌లో 3,771క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేశామన్నారు.

వారసంత ప్రారంభం

మల్లాపూర్, ఫిబ్రవరి 15: మొగిలిపేటలో నూతనంగా ప్రతి శనివారం వారసంతను ఏర్పాటు చేయగా, వీడీసీ అధ్యక్షుడు మహబూబ్‌ఖాన్ ప్రారంభించారు. గ్రామస్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ వారసంతను ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు.

అన్నదమ్ముళ్లపై కేసు

సారంగాపూర్, ఫిబ్రవరి 15: రేచపల్లికి చెందిన అన్నదమ్ములు సిరికొండ మల్లయ్య, సిరికొండ నారాయణ మధ్య వారికి వారసత్వంగా వచ్చిన భూమి విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. శనివారం ఇద్దరు అన్నదమ్ములు ఒకరిపైఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. ఒకరిపై ఒకరు ఠాణా లో ఫిర్యాదు చేయగా, ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దత్తాద్రి తెలిపారు.

నూతన నియామకం

జగిత్యాల టవర్ సర్కిల్, ఫిబ్రవరి 15: ఉమ్మడి కరీంనగర్ జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ల కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డం లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా పీ శ్రీనివాస్, జే మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ రామకృష్ణారావు, కోశాధికారిగా రాము, సభ్యులుగా సాయిమనోహర్, కాసారపు మల్లేశంను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాజిరెడ్డి వ్యవహరించారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐబీఎం సంస్థ ప్రతినిధి

ఏఐ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

కోరుట్ల, ఫిబ్రవరి 15: విద్యార్థులు ఏజీ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ ఐబీఎం ప్రతినిధులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు ఐబీఎం ఇంటర్నేషనల్ బిజినెస్ మెషిన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఐజీ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. ఏఐ టెక్నాలజీలో వినియోగించే మోడ్యూల్స్ పనితీరును వివరించారు. ఇక్కడ కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ, సంస్థ ప్రతినిధులు మహ్మద్ షరీఫ్, ప్రతీక్‌రావు, విగ్నేష్, యూసూఫ్, కళాశాల డైరెక్టర్లు హరిప్రియ అంజయ్య గౌడ్, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, కంప్యూటర్ అధ్యాపకులు రాజ్‌కుమార్, నరేందర్, శ్రీనివాస్, గంగలక్ష్మి, తదితరులు ఉన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 15: పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ కోరారు. పట్టణంలో చేపట్టిన పన్నుల చెల్లింపు స్పెషల్ డ్రైవ్ ను శనివారం ఆయన పర్యవేక్షించారు. ఇంటి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్, వ్యాపార ప్రకటనల పన్నులను సకాలంలో చెల్లించాలని సూచించారు. కాగా, ఇప్పటి వరకు 65 శాతం ఇంటి పన్ను వసూలు చేశామని తెలిపారు. ఇక్కడ ఆర్ఐ అక్షయ్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, విజయ్, ముజీబ్, లక్ష్మణ్, నవీన్, జ్యోతి, వంశీ ఉన్నారు.

17న బేస్‌బాల్ ఎంపిక పోటీలు

జగిత్యాల, ఫిబ్రవరి 15: జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ప్రజ్ఞ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సబ్ జూనియర్స్ స్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పుల గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు సోమవారం ఉదయం 10గంటల లోగా ఆధార్‌కార్డు, క్రీడా దుస్తులతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాల కోసం నంబర్‌ను (7306 224589) సంప్రదించాలని సూచించారు.

సబ్ స్టేషన్ మరమ్మతులు పూర్తి

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 15: జిల్లా కేంద్రంలోని టౌన్-3 సెక్సన్ ఆఫీస్ పరిధిలోని హౌసింగ్ బోర్డు సబ్ స్టేషన్‌లో మరమ్మతులు పూర్తి చేసినట్లు ఏఈ ప్రవీణ్ కుమార్ శనివారం పేర్కొన్నారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా టోటల్ మెయింటనెన్స్ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. ఇక్కడ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీసాలియానాయక్, డీఈ గోపీకృష్ణ, డీఈ టెక్నికల్ గంగారాం, టౌన్ ఏడీఈ జవహర్‌లాల్ నాయక్, ఏఈ రహీం, తదితరులు ఉన్నారు.

లబ్ధిదారులకు అవగాహన

సారంగాపూర్/రాయికల్/జగిత్యాలరూరల్/కథలాపూర్, ఫిబ్రవరి 15: జిల్లాలోని పలు గ్రామాల్లో శనివారం అధికారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల విధివిధానాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఫైలెట్ ప్రాజెక్టులో భాగంగా సారంపూర్ మండలం నాయకపుగూడెం, రాయికల్ మండలం ధర్మాజీపేట, జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి, కథలాపూర్ మండలం పోసానిపేట గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో శనివారం సమావేశమయాయరు. ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం గురించి లబ్ధిదారుల సందేహాలను నివృత్తి చేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

అభ్యర్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషన్

కోరుట్ల, ఫిబ్రవరి 15: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని తహసీల్దార్ ఇట్యాల కిషన్ పేర్కొన్నారు. పట్టణంలోని సీ ప్రభాకర్ స్మారక గ్రంథాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. డీఎస్సీ, గ్రూప్ పోటీ పరీక్షలకు సన్నద్ధవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. అకుంఠిత దీక్ష, పట్టుదలతో చదివితే ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. ఇక్కడ గ్రంథాలయ కమిటీ ప్రతినిధులు భూమయ్య, విశ్వనాథం, లక్ష్మణ్, రాంబాబు, రాధ, రాజ్‌కుమార్, భాస్కర్ ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

నిరసన తెలుపుతున్న రైతులు

రాయికల్, ఫిబ్రవరి 15: ఇటిక్యాలలో పంట పొలాల్లోంచి విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వెళ్తున్నాయి. ఏడాది నుంచి విద్యుత్ వైర్లు కిందికి వేళాడుతూనే ఉన్నాయని, విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. తీగలు తగిలి గేదెలు, గొర్రెలు చనిపోతున్నాయని ఆవేదన చెందారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు.

పీహెచ్‌సీ పరిశీలన

కొడిమ్యాల, ఫిబ్రవరి 15: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ నెల 21న రాష్ట్ర బృందం పీహెచ్‌సీకి వస్తున్న సందర్భంగా మండలంలో కుష్టు వ్యాధి కేసుల వివరాలపై ఆరా తీశారు. ఇక్కడ వైద్యాధికారులు పరమేశ్వరి, నరేశ్, సీహెచ్‌వో రాజశేఖర్ ఉన్నారు.

రంగు మారిన మిషన్ భగీరథ నీరు

కలూరులో రంగు మారిన మిషన్ భగీరథ నీరు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 15: ఇంటింటికీ తాగునీరు అందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. గతంలో నీటి సరఫరా సాఫీగా సాగింది. నాలుగు రోజులుగా కల్లూరులో మిషన్ భగీరథ నీరు రంగు మారి బెల్లం కలర్‌లో వస్తున్నాయి. సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

సీజ్ చేసిన కారు ఇ-వేలం
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్గిల్ చౌక్ శాఖ - 20137, కోరట్ల - 505 326.

"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా స్థితిలో" మరియు "ఏది ఎలా ఉంటే అలా" మా రుణగ్రహీతల యొక్క దిగువ తెలిపిన కార్డ్ ఇ-వేలం కొరకు ఇ-కొటేషన్లు కోరబడుచున్నవి. EMIలు చెల్లించుటలో రుణగ్రహీత